ప్రజాశక్తి
మంగళవారం 26 డిసెంబర్ 2023
5
విజయనగరం



28న భవన నిర్మాణ కార్మికుల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమం కోసం గతంలో ఉన్న పథకాలు కొనసాగించాలని , ప్రమాదం జరిగి వికలాంగులైతే 2లక్షలు, మరణిస్తే రూ.5లక్షలు ఇచ్చి ఆదుకోవాలని, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇసుక, ఇనుము, ఇతర భవన నిర్మాణ వస్తువులు ధరలూ తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మికసంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి బి.రమణ తెలిపారు. సోమవారం ప్రజా సంఘాల ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ కరోనా కాలంలో కూడా భవన నిర్మాణ కార్మికులకు రూ.10వేలు సహాయం చేస్తానని అకౌంట్లు ఓపెన్ చేసిన జగన్ మోహన్ రెడ్డి ఎటువంటి సహాయం చేయకుండా తీవ్ర మనస్థాపానికి గురి చేశారన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డ్ ధ్వారా సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి కందిత్రినాధ్, కమిటీ నాయకులు రమేష్, ఎర్రిబాబు, సతీష్, పైడినాయుడు, చినబాబు, సత్యం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెట

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీలు, ఆశా కార్యకర్తలు రోడ్డెక్కారు. అదే బాటలో మంగళవారం నుంచి పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య, ఇతర విభాగాల కార్మికులు సమ్మె బాట పట్టనున్నారు. పుర ఉద్యోగుల సంఘాలు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సమ్మె చేయనుండగా, ఎఐటియుసి అనుబంధం, టిఎన్‌జియుసి, వైఎస్‌ఆర్ ట్రేడ్‌యూనియన్ జెఎసి ఆధ్వర్యాన సమ్మెకు మద్దతు పలకనున్నారు. ఇప్పటికే ఆయా సంఘాలు నాయకులు కార్మికులు నాయకులు కమిషనర్లకు నోటీసులు ఇచ్చారు. దీంతో మంగళవారం నుంచి విజయనగరం, బొబ్బిలి మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో పురపాలక పారిశుధ్య సేవలు నిలిచిపోనున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేసి నప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఆందోళన బాట పట్టారు. జూన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన సమావేశంలోని నిర్ణయాలను నేటి వరకు అమలు చేయలేదు. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నగరపాలక, నగర పంచాయతీ, మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

ఇవీ డిమాండ్లు....

పొరుగు సేవలు, ఎన్‌ఎంఆర్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి. ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు నెలకు రూ.26 వేలు ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనం గ్రాట్యుటీ, పింఛను, ఇతర సదుపాయాల కల్పించాలి. ఇంజినీరింగ్,

నేటి నుంచి నిలిచిపోనున్న పారిశుధ్య సేవలు

గార్బేజీ డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మలేరియా విభాగాల్లో పనిచేసే కార్మికులకు రిస్క్ హెల్త్ అలవెన్సులు ఇవ్వాలి. విలీన పంచాయతీల్లో పనిచేసే వారు, కరోనా, వరదల సందర్భంగా విధుల్లోకి తీసుకు న్న వారికి గుర్తింపునివ్వాలి . క్లాప్ వాహనదారులకు రూ.18,500 జీతం ,పట్టణాల విస్తీర్ణం మేరకు సిబ్బంది పెంపు, ఉద్యోగ భద్రత, 11వ పిఆర్‌సి ప్రకారం రూ.20 వేల వేతనం చెల్లింపు, కరవు భత్యం వంటి సమస్యలు పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్నారు.

ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలి

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలి. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. అవుట్ సోర్సింగ్ వారిని పర్మినెంటు చేస్తామని చెప్పి ఆప్కాస్‌లో చేర్చారు. దీంతో ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి వస్తోంది. వేతనాలు కూడా పెంచకుండా వేధిస్తున్నారు. వెంటనే వేతనాలు పెంచాలి. లేదంటే సమ్మె విరమించేది లేదు.

**- ఎ.జగన్మోహన్‌రావు,
ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు**

సమ్మెను జయప్రదం చేయండి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా జరిగే మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం విజయనగరం కార్పొరేషన్ పరిధి లో పారిశుధ్య కార్మికులకు, ఇంజినీరింగ్ కార్మికులకు, డ్రైవర్లకు , పంప్ హౌస్ కార్మికులకు విస్తతంగా కరపత్ర ప్రచారం నిర్వహించినట్లు యూనియన్ కార్యదర్శి భాస్కరరావు, జిల్లా బాధ్యులు జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామారావు, అశోక్, రామచంద్రరావు, రాజు, రమా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి వరప్రసాద్.. ఈ పేరు వినగానే మూడేళ్ల క్రితం ఉద్యోగాల పేరిట జరిగిన మోసం గుర్తొస్తోంది. నిరుద్యోగులను ఆసరాగా చేసుకుని, మోసాలకు పాల్పడుతున్న వారు ఎక్కువే. కానీ, వరప్రసాద్ చేసిన మోసానికి బలైన వారు నిరుపేద దళితులు కావడం బాధాకరం. అయితే మూడేళ్లుగా వరప్రసాద్ బాధితులు అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నారు. పోలీసులను ఆశ్రయించారు. ఎర్రజెండా సాయంతో ఆందోళనలు, ధర్నాలు చేశారు. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ , కాళ్లరిగేలా తిరిగారు. చివరికి న్యాయ పోరాటం చేశారు. కానీ నేటికీ పూర్తి స్థాయిలో బాధితులకు న్యాయం జరగలేదు.

న్యాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు

వరప్రసాద్ బాధితులకు న్యాయం జరిగేదెప్పుడు?

ఏళ్లుగా ఎదురుచూస్తున్న కిర్ల బాధితులు • పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - జామి

జిల్లా పరిషత్తులో ఉద్యోగాలు ఇప్పిస్తానని అందులో చిరు ఉద్యోగిగా ఉన్న కొత్తపల్లి వరప్రసాద్ నిరుద్యోగుల ఉంచి డబ్బులు వసూలు చేశాడు. అయితే వరప్రసాద్ సొంత గ్రామం జామి మండలంలోని జట్టేటివలస కావడంతో సమీప గ్రామాల నిరుద్యోగులను ఎంచుకున్నాడు. అంతేకాదు, తన సామాజిక తరగతికి చెందిన దళితులు, బంధువులు వరప్రసాద్‌కు బలైపోయారు. ఒక్కొక్కరి దగ్గర రూ.లక్ష చొప్పున వసూలు చేసి, కొంతకాలం వారిని నమ్మించి, చివరికి తానూ మోసపోయానని చేతులెత్తేశాడు. ఇలా జిల్లా వ్యాప్తంగా వరప్రసాద్ బాధితులు ఉన్నారు. అయితే కిర్ల గ్రామానికి చెందిన సారికి వెంకటరావు, పత్రి దేముడమ్మ, పత్రి అప్పలనరసమ్మ, దండి ఎర్నమ్మ, పత్రి హరనాథ్‌బాబు... ఇలా 14 మంది వరకు మోసపోయిన వారిలో ఉన్నారు. వీరంతా డిగ్రీలు, పీజీలు చదివిన దళితులు కావడం, ఉన్న కొద్దిపాటి ఆర్థిక పరిస్థితుల్లో అప్పులు చేసి వరప్రసాద్‌కు రూ.లక్షలు ముట్టజెప్పిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. పోరాడుతూ, చివరికి వరప్రసాద్ పేరున ఉన్న 55 సెంట్ల భూమిని పురోణీ రాయించుకున్నారు. కానీ వీరికి రాసిన తరవాత వరప్రసాద్ భూములు అమ్ముకోవడం మొదలు పెట్టడంతోపాటు తప్పించుకునే చర్యలు చేపట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు.

దీంతో ఇప్పటికే చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయిన బాధితులు, ఇంకొంత అప్పులు చేసి మరీ న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం విచారణ చేపట్టి, బాధితులకు వరప్రసాద్ డబ్బు చెల్లించే వరకు ఆయన పేరిట ఉన్న భూములు క్రయవిక్రయాలు నిషేధించాలని తీర్పు వెలువరించింది. కానీ కొత్తపల్లి వరప్రసాద్ పేరున ఉన్న భూములు రాజకీయ నాయకులు జి.రవికుమార్ పేరుతో ఆన్‌లైన్‌లో కనిపించడంతో బాధితులు మరోసారి ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా డబ్బులు పోగొట్టుకున్న బాధితులు మూడేళ్లుగా న్యాయం కోసం తిరుగుతూనే ఉన్నా... ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆందోళన చెందొద్దు

తహశీల్దార్ హేమంత్ కుమార్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా, బాధితుల ఫిర్యాదు నేపథ్యంలో న్యాయస్థానం సూచనల మేరకు రీసర్వేలో భూమిని మార్పు చేసినట్లు తెలిపారు. త్వరలోనే తప్పుగా నమోదైన భూమి యథాతథంగా వరప్రసాద్ పేరుతో ఆన్‌లైన్లో కనిపిస్తుందని చెప్పారు. గతంలో ఉన్న రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాన్ని సరిచేశామని, ఇందులో ఎవరి ఒత్తిళ్లూ లేవని చెప్పారు. బాధితులకు ఈ విషయాన్ని తెలియజేశామని, ఆందోళన చెందాల్సిన పనిలేదని హామీ ఇచ్చారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా

జిల్లాలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా పేరిట భారీ క్రీడా సంబరం ప్రారంభం కానుంది. సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిల్లో జరిగే ఈ పోటీల్లో వందలాది మంది క్రీడాకారులు పాల్గొనేందుకు రంగం సిద్ధమైంది. గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు స్పోర్ట్స్ కిట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు ఇవ్వనున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పోటీలు ప్రారంభం కానున్నాయి.

- **క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు**
- **పోటీల్లో పాల్గొననున్న 1,42,728 మంది క్రీడాకారులు**
- **క్రీడా సంబరానికి ఏర్పాట్లు పూర్తి**

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గత నెల 20 నుంచి తమ పేర్లను సచివాలయాల్లో రిజిష్టర్ చేయించుకున్నారు. ఇలా ఇప్పటికు వరకు సుమారుగా లక్షా, 42 వేల, 728 మంది క్రీడాపోటీలకు ముందుకు వచ్చారు. ఇప్పటికీ కూడా క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధపడే వారికి అవకాశాన్ని కల్పించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయి. క్రీడల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా యంత్రాంగం, వీటిపై ఇప్పటికే విస్తత ప్రచారాన్ని నిర్వహించింది. ప్రతీ గ్రామంలో, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. జట్లుగా ఆడే క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలకు ఇప్పటివరకు 12188 జట్లను ప్రత్యేక యాప్ ద్వారా రూపొందించారు. మిగిలిన క్రీడాకారులు వ్యక్తిగత పోటీల్లో తలపడతారు. పోటీలకు అవసరమైన సుమారు 20,296 క్రీడా పరికరాలను ఆయా గ్రామాలకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 342 క్రీడా మైదానాల్లో పోటీలు జరగనున్నాయి. జిల్లాలోని 626 సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు జరగనుండగా, వీటి నిర్వహణలో సహకరించేందుకు 6,260 మంది క్రీడా వాలంటీర్లను ఎంపిక చేశారు. వీరందరికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేసి, అవసరమైన పరికరాలను అందజేశారు. కొంతమంది ఉత్సాహవంతులైన క్రీడాకారులు ఒకటి కంటే ఎక్కువ క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 6 వేల మ్యాచ్‌లు జరగనున్నాయి.

డిసెంబరు 26 నుంచి జనవరి 9 వరకు సచివాలయ స్థాయిలో, జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో, జనవరి 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయి. ఆసక్తి ఉండి 15 ఏళ్ల పైబడిన వారికి ఈ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. ప్రతి సచివాలయం పరిధిలో క్రీడా మైదానాలను ఇప్పటికే సిద్ధం చేసి, క్రీడా సామగ్రిని తరలించారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి ఉంటుంది. సచివాలయ స్థాయిలోని విజేతలకు స్పోర్ట్స్ కిట్లను బహుమతిగా ఇస్తారు. క్రీడాకారులకు మైదానం వద్దే భోజన సదుపాయాన్ని కల్పించారు. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పర్యవేక్షణలో విద్యాశాఖ, పంచాయితీరాజ్, వైద్యారోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో యువజన సర్వీసుల శాఖ ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తోంది.

ఆడుదాం ఆంధ్రా పోటీల వివరాలు

పోటీలు జరగనున్న సచివాలయాలు	: 626
స్పోర్ట్స్ వలంటీర్లు	: 6260
క్రీడా మైదానాలు	: 342
క్రీడా పరికరాలు	: 20,296
పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు	: 142728
పురుషులు	: 75873
స్త్రీలు	: 27505
మొత్తం జట్లు	: 12188
మహిళల జట్లు	: 3592
పురుషుల జట్లు	: 8596

సమ్మె శిబిరంలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆరో రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు మరిచి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను మోసం చేశారని, ఇచ్చిన హామీని అమలు చేయకపోతే తగిన గుణపాఠం చెబుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీరు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. యంటియస్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించి, వార్షిక బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, గ్రాట్యుటీ, 20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్, వేతనాల పెంపు, తక్షణమే బకాయిల చెల్లింపు తదితర సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటంతో సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె చేయాల్సి వస్తుందన్నారు. ఈ ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి గురువులు ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఎం మనసు మార్చు ప్రభువా

అంగన్వాడీల వినూత్న నిరసనలు • కొవ్వొత్తులు వెలిగించి ఏసుక్రీస్తుకు వేడుకోలు • 14వ రోజుకు నిరవధిక సమ్మె

బొబ్బిలిలో సమ్మె శిబిరంలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 14వ రోజుకు చేరుకుంది. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈనేపథ్యంలో క్రిస్మస్ సందర్భంగా అంగన్వాడీలు కేక్ కట్ చేసి, కొవ్వొత్తులు వెలిగించి యేసయ్య మీరైనా జగన్మోహన్ రెడ్డి మనసు మార్చాలని, అంగన్వాడీలకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో వినూత్నంగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇష్ట దైవం యేసయ్య ద్వారా ఆయన మనసు మార్చి అంగన్వాడీలకు న్యాయం చేయాలని కేకు ,కత్తిరించి కొవ్వొత్తులతో తమ అభ్యర్ధను తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకర్రావు, జిల్లా కార్యదర్శి బి.రమణ, నగర కార్యదర్శి కంది త్రినాథ్ తదితరులు మద్దతు తెలిపారు. సమ్మెలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలోని సమ్మె శిబిరంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని యేసుక్రీస్తుకు ప్రార్థనలు చేశారు. శిబిరంలో కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్‌ఫోన్లకు పూజలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, అనురాధ, ఉమాగౌరి, నిర్మల, పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.గోపాలం పాల్గొన్నారు.

గజపతినగరంరూరల్ : నిరవధిక సమ్మెలో భాగంగా గజపతినగరంలో అంగన్వాడీలు 14వ రోజు సోమవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. అంగన్వాడీలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.హరికృష్ణవేణి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఆర్‌టిసి యూనియన్ నాయకులు చంద్రయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.సుభాషిని, రాములమ్మ, సన్యాసమ్మ, సౌజన్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి సిఐటియు మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

శృంగవరపుకోట : మండలంలో అంగన్వాడీల సమ్మె సోమవారం కొనసాగింది. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్ డి.శ్యామల, డి.జయలక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల పాల్గొన్నారు.

విజయనగరంలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

జామి : తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగింది. అంగన్వాడీలకు సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, విష్ణుణమ్మ, రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, దేవుడమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చీపురుపల్లి : అంగన్‌వాడీల సమ్మె 14 రోజులుగా కొనసాగుతోంది. సోమవారం క్రిస్టమస్ పండగ అయినప్పటికీ అంగన్‌వాడీలు మాత్రం తమ సమ్మెను ఆపలేదు. తమ సమస్యలు నెరవేరే వరకు తమ సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు తెగేసి చెబుతున్నారు.



రామభద్రపురంలో దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు

గజపతినగరంలో సమ్మె శిబిరంలో పాల్గొన్న అంగన్వాడీలు

చీపురుపల్లిలో రిలే దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు

బొడ్డు రామును కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

టిడిపిలోకి బొడ్డు రాము

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, ఆయన భార్య కొత్తపాలెం సర్పంచ్ బొడ్డు సత్యవతి టిడిపిలో చేరారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. బొడ్డు రాము గతంలో టిడిపి నుంచి బిజెపిలో చేరారు. ఇటీవల బిజెపికి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరకుండా కొంతకాలంగా మౌనంగా ఉంటూ వచ్చారు. టిడిపి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఆ పార్టీలో చేరినట్లు మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము తెలిపారు. తనతోపాటు కొత్తపాలెం సర్పంచ్ బొడ్డు సత్యవతి, ఉపసర్పంచ్ పోటిపిరెడ్డి అప్పలమహేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు గొర్లి వెంకటరమణ, భూమిరెడ్డి రామకృష్ణ, దేవుపల్లి నారంనాయుడు, గనివాడ సింహాద్రప్పడు, పప్పల అప్పారావు, బిజెపి గ్రామ అధ్యక్షులు గొల్లు సూర్యనారాయణ, వైసిపి సీనియర్ నాయకులు వర్రి సూర్యనారాయణ, గొల్లు శ్రీరామమూర్తి టిడిపిలో చేరినట్లు చెప్పారు.

'జిందాల్'లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడు గోకేడ చిన్నారావు (56) సోమవారం మరణించాడు. లక్కవరపుకోట మండలంలోని సంతపేట గ్రామానికి చెందిన చిన్నారావు జిందాల్ కర్మాగారంలో పనిచేస్తూ సోమవారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో యాజమాన్యం ఆస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే సిఐటియు నాయకులు గాడి అప్పారావు, వైసిపి నాయకులు నెక్కల నాయుడుబాబు యాజమాన్యంతో చర్చలు జరిపారు. చిన్నారావు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇప్పించారు. చర్చల్లో యాజమాన్యం నుంచి దినేష్ శర్మ, గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న అవనాపు విజయ్,విక్రమ్

వృద్ధులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నాగవంశం కులస్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్ అన్నారు. నగరంలోని ఆ సంఘం భవనంలో సోమవారం వృద్ధులకు, సంఘ ప్రతినిధులు రగ్గులు పంపిణీ చేశారు. నాగవంశం కులస్థులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నాగవంశం సంక్షేమ సంఘం నుండి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా పట్టణంలో ఉన్న నాగవంశం కులస్థులలో అరవై ఏళ్ళు దాటిన వృద్ధులకు ఉపయుక్తంగా ఉంటుందని రగ్గులు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులతో ప్రతినెలా ఒక మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారికి కేటరాక్టు ఆపరేషన్లు చేయించి కళ్ళద్దాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాగవంశం సంక్షేమ సంఘం ప్రతినిధులు కాళ్ళ గౌరీ శంకర్, అవనాపు విజయ్, గాడు అప్పారావు,రామసింగు సత్య ప్రసాద్ రావు, గాడు భానోజిరావు, కనకల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలుగోలులో వృద్ధురాళ్లతో మాట్లాడుతున్న జనసేన నాయకులు మాధవి

టిడిపి, జనసేనతో మెరుగైన పాలన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడిపి, జనసేనతో మెరుగైన పాలన జరుగుతుందని జన సేన నియోజక వర్గం ఇంఛార్జి లోకం మాధవి అన్నారు. ఆదివారం రాత్రి అలుగోలులో జనసేన మన ఊరిలో జనవాణి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన పరిపాలన కావాలంటే అది జనసేన, టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ ఎంత అవసరమో వివరించారు. ప్రభుత్వం యంత్రాంగం తీరు కూడా బాగోలేదన్నారు. ఇంత అరాచకమైన ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేయకూడద చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అమూల్యమైన ఓటును జనసేన పార్టీ గాజు గ్లాస్ గుర్తుపై వేయాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కరుమజ్జి గోవింద్, ఆల్తి రామచంద్ర, ఆల్తి శ్రీను, బద్రి, తాతబాబు, వేణు, బాలాజీ, సుగుణ మారుతి నాయుడు, రెల్లి సత్యనారాయణ, చందక సాయి, కొంచాడ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన జయహో జగనన్న పాదయాత్ర పూర్తిచేసుకుని తిరిగి వస్తున్న సందర్భంగా మంగళవారం నిర్వహించే బైక్ యాత్రను విజయవంతం చేయాలని ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి కోరారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం వద్దనున్న ప్రజా సంకల్ప యాత్ర పైలాన్ వద్ద నుండి బొడ్డవర వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వక్తృత్వ పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవ సంబంధాలపై మొబైల్, సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై సోమవారం చైతన్య జూనియర్ కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సుమారు 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ఫౌండేషన్ నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు.

పేరుకుపోతున్న మురుగునీరు

• దోమల విజృంభణ • దుర్వాసనతో ఇక్కట్లు • పట్టించుకోని నగరపాలక ప్రజారోగ్యశాఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రోడ్డుకు ఇరువైపులా పెద్ద కాలువలు కట్టేశాం.. పక్కనే ఉన్న కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉంటే మాకేంటి అన్న చందంగా నగర పాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది, అధికారుల తీరు ఉంది. గూడ్స్ షెడ్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు వెడల్పులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పెద్ద కాలువలు నిర్మాణం నగరపాలక సంస్థ చేపట్టింది. కాలువల నిర్మాణం చేపట్టారు తప్ప ఆయా వీధుల నుంచి కాలువలు ద్వారా వచ్చే మురుగు నీరు ప్రధాన కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణేష్ కోవెల ఎదురుగా అమృత టిఫిన్ హోటల్ వద్ద ప్రధాన కాలువలకు పక్క వీధిలో రెహమాన్ డాక్టర్ ఇంటి పక్క నుంచి కాలువల ద్వారా మురుగు నీరు పోయేందుకు అనుసంధానం చేయకపోవడంతో ఆయా కాలువలు చిన్నపాటి చెరువును తలపించేలా ఉన్నాయి. మరోవైపు హోటల్ యాజమానులు కూడా చెత్త చెదారం కాలువల్లో పడేస్తుండంతో మురుగు నీరు నిల్వ ఉండి కంపు కొడుతోంది. రెహమాన్ డాక్టర్ ఇంటి చుట్టూ నివాసాల్లో ఉన్నవారు సైతం ఈ దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు దోమలు విపరీతంగా విజృంభిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్ సిబ్బందికి, అధికారులు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజాశక్తి వద్ద గోడు వెల్లబోసుకున్నారు. వెంటనే నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెహమాన్ ఆస్పత్రి సమీపంలో కాలువల్లో నిల్వ ఉన్న మురుగునీరు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరూ సహృదయంతో జరుపుకునే పర్వదినమే క్రిస్మస్ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. సోమవారం క్రిస్మస్ ను పురస్కరించుకొని స్థానిక మెయిన్ రోడ్ లో ఉన్న సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. మత పెద్దలు ముందుగా ప్రత్యేక ప్రార్ధనలు జరిపి క్రిస్మస్ కేకులు కట్ చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ఏసు అందరికీ మంచి మార్గ నిర్దేశకులని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పూసపాటిరేగ : మండలంలోని క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ఉదయాన్నే ప్రార్ధన మందిరాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పూసపాటిరేగ యుఆర్పిఎఫ్ చర్చిలో పాస్టర్ ఎం. జీవన్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ టి. సీతారాం, నాయకులు పిన్నింటి అప్పలనాయుడు, పిడిఎఫ్ ప్రసాద్ తదితరులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

బొబ్బిలి : పట్టణంలో సోమవారం క్రిస్టమస్ ఘనంగా జరిగింది. సిబిఎం, ఆర్సీఎం, బాప్టిస్ట్, ఇతర చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామున క్రైస్తవులు వీధులలో ర్యాలీగా వెళ్ళి యేసు పాటలను ఆలపించారు. క్రిస్టమస్ ప్రాముఖ్యతను క్రైస్తవులకు ఫాస్టర్లు, ఫాదర్స్ వివరించారు. క్రైస్తవులతో చర్చిలు కలకళలాడాయి.

నగరాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. సోమవారం కంటోన్మెంట్‌లోని ఎస్‌బిటి మార్కెట్ జంక్షన్లో రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ పైలాన్ రూపంలో రూ.8లక్షలతో నిర్మించిన రోటరీ క్లాక్ టవర్‌ను కోలగట్ల ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ స్థాయికి అవతరించిన తర్వాత నగరానికి అదే స్థాయి హంగులను ఏర్పాటు చేసేందుకు కృషి చేశామన్నారు. రోటరీ క్లబ్ అంధిస్తున్న సేవలు మరువ రానివని అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో స్వర్గధామం, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసిన సమయంలో తానే శాసనసభ్యుడిగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు కోరిన వెంటనే పేద రోగులకు డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు 430 గజాల స్థలాన్ని సమీకరించి అందజేశామన్నారు. సామాజిక సేవ చేసే వారికి వెనుదన్నుగా నిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ రావూరి దత్త సుబ్బారావు, అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ డా.తిరుమల ప్రసాద్, కార్యదర్శి నీతావిజ్వాణి, ప్రాజెక్ట్ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు కాళ్లూ నుజ్జయిన రాములు

చేయి తెగిపడిన కళ్యాణి

బూరాడ వద్ద ఘోర ప్రమాదం

- రెండు ఆటోలు ఢీ
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- తెగి పడిన మహిళ చేయి
- ఇంటికి చేరేలోగా పెను ప్రమాదం

తెగిపడిన కళ్యాణి చెయ్యి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ గ్రామ సమీపంలో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒక మహిళ చేయి తెగి రోడ్డుపై పడటంతో చూపురులు సైతం ఆందోళనకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే..పాలకొండ నుంచి రాజాం వెళ్తున్న ఆటో, రాజాం నుంచి అంబాడ వెంకటాపురం వైపు ఎదురుగా వస్తున్న మరో ఆటో బూరాడ వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన వావిలపల్లి కళ్యాణికి కుడి చేయి తెగిపడింది. కుడికాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. అదే గ్రామానికి చెందిన పనస దుర్గమ్మ తలకు తీవ్ర గాయమైంది. తాతపూడి సూరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చాటాయివలస గ్రామానికి చెందిన గోదారి రాములకు రెండు కాళ్ల నుజ్జు నుజ్జు అయ్యాయి. లక్ష్మంపురం గ్రామానికి చెందిన కెంబూరి బంగారమ్మకు కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులకు 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కొంతమందిని రాజాం కేర్ ఆసుపత్రికి, ఇంకొంతమందిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కళ్యాణి, దుర్గమ్మ, రాములు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు సమాచారం మేరకు రేగిడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వ్యాను ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-బాడంగి

డ్రైవర్ నిర్లక్ష్యం ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. నిర్లక్ష్యంగా వ్యాను నడపడంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన బాడంగి మండలంలోని గజరాయనివలసలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ జయంతి కథనం ప్రకారం... గజరాయనివలస గ్రామానికి చెందిన నడిమింటి సత్యం (68).. సోమవారం సాయంత్రం కిరాణా షాపు వద్ద కూర్చున్నాడు. మొక్కజొన్న లోడు కోసం అదే వీధిలోకి వచ్చిన బొలెరో వ్యాను డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపాడు. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఒక్కసారిగా సత్యంపైకి వ్యాను దూసికెళ్లింది. తీవ్రగాయాలైన ఆయన్ను గ్రామస్తులు బాడంగి సిహెచ్‌సికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయంతి తెలిపారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-రేగిడి

వారంరోజుల క్రితం అగ్ని ప్రమాదంలో గాయపడిన పొగిరి సింహాద్రమ్మ(62) విశాఖలో ఆదివారం మృతి చెందింది. మండలంలోని బూరాడకు చెందిన పొగిరి సింహాద్రమ్మ 7 రోజుల క్రితం ఇంటి వద్ద కట్టెల పొయ్యిపై నీరు మరగపెడుతుండగా, చలికాచింది. దీంతో చీర కు నిప్పంటు కోవటంతో 70శాతం శరీర భాగాలు కాలిపోయాయి.. కుటుంబ సభ్యులు విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు.. పరిస్థితి విషమించి కన్నుమూసింది.

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను తాను ప్రారంభిస్తానని తెలిపారు. మిగిలిన మండల కేంద్రాల్లో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులంతా ఆటల పోటీలలో పాల్గొవాలని కోరారు.

ఎస్ఐగా ఎంపికైన కోటారావుకు సన్మానం

ప్రజాశక్తి - జామి

మండలంలోని వెన్నె గ్రామానికి చెందిన రంధి కోటారావు ఎస్ఐగా ఎంపికవడంతో సోమవారం గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చలుమూరి సత్యారావు, గ్రామ నాయకులు కోటారావును సన్మానించారు. గ్రామ సర్పంచ్ చలమూరు జయలక్ష్మి అభినందనలు తెలియజేశారు.

నెల్లిమర్లలో 'బైరెడ్డి' వర్ధంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ స్వర్గీయ బైరెడ్డి సూర్యనారాయణ వర్ధంతిని సోమవారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కళ్యాణ మండపంలో ఆయన కుమారుడు మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగేశ్వర రావు, లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ స్వర్గీయ బైరెడ్డి సూర్యనారాయణ నిరాడంబర జీవితాన్ని గడిపి సర్పంచ్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎదిగారని కొనియాడారు. గ్రామాన్ని, జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించి ఎవరికి ఏ కష్టం, అవసరం వచ్చినా వెంటనే స్పందించి సహాయ సహకారాలు అందంచేవారని చెప్పారు. టిడిపిని నెల్లిమర్లతో బాటు గ్రామాల్లో విస్తరించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, మహంతి శ్రీని వాసరావు, కాళ్ళ రాజ శేఖర్, బైరెడ్డి సూర్యనారాయణ, చందక పెంటంనాయుడు, రెడ్డి వేణు, కలిశెట్టి కన్నంనాయుడు, శివరాం మాస్టర్, చందకు శంకర్రావు, బోలె కృష్ణమూర్తి, బైరెడ్డి సత్యనారాయణ, నడిపేన నారాయణరావు, బైరెడ్డి సతీష్, విసినిగిరి అప్పారావు, బైరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

నెల్లిమర్ల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వ కర్మ యోజన పథకాన్ని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు సద్వినియోగం చేసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గొలగాని రమేష్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆదిత్య పాఠశాలలో చేతి వృత్తులదార్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తులతో ఆర్ధికంగా మరింత ఎదగడానికి శిక్షణ కల్పించడంతో బాటు ఉపాధి పొందడానికి 5శాతం తక్కువ వడ్డీతో రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం రుణాలను ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గిడుతూరి రాము, కార్యదర్శి వి.సూరిబాబు, టి. అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం కోట : ఎపిఎస్ ఆర్‌టిసి విజయనగరం డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 14 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని, 15వ బ్యాచ్‌కు శిక్షణ జనవరి మొదటి వారంలో ప్రారంభమవుతుందని తెలిపారు. 40 రోజుల పాటు మెలకువలతో కూడిన శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని తెలిపారు.శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు 7382924030 , 9866649336 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

'గెలుపే లక్ష్యంగా పనిచేస్తా'

రామభద్రపురం : సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు పత్తిగుల్ల ఏకనాథ్ తెలిపారు. ఈ పదవి తనకు వచ్చేందుకు కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడును సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏకనాథ్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, వైసిపి నాయకులు లెంక శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సుందర హరీష్ కృతజ్ఞతలు

భోగాపురం : వైసిపి మండల యువజన అధ్యక్షులుగా భోగాపురం గ్రామానికి చెందిన సుందర హరీష్‌ను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఇటీవలి నియమించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు హరీష్ సోమవారం ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని ఆయనకు హామీ ఇచ్చారు. యువకులతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. నాయకులు పల్లంట్ల శ్రీనివాసరావు, కొయ్య బంగార్రాజు, సుందర వెంకన్న, రోహిత్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనండి

విజయనగరం టౌన్ : యువతంతా ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను నిర్వహిస్తుందన్నారు. 12 కోట్లకు పైగా ప్రైజ్ మనీ, 30 లక్షలకు పైగా క్రీడాకారులు.. 3 లక్షల పైగా మ్యాచ్‌లు, 8 వేలకు పైగా సిబ్బంది, 9వేల మైదానాలలో 15 వేల సచివాలయలలో ఆటలు పోటీలు జరుగుతాయని తెలిపారు. అధిక సంఖ్యలో యువత ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

OS 32/2023

BETWEEN:
గేదెల మురళీ ......వాది
AND:
నడిపల్లి భాస్కరరావు ....ప్రతివాది
To,
నడిపల్లి భాస్కరరావు, S/o లేటు క్రిష్ణ, కిరణా వ్యాపారం, అగురువీధి, రామభద్రపురం గ్రామం & మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో వివరించిన ప్రాంశరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం, పై నెంబరు దావా మీపై దాఖలు చేసి యున్నారు. మీరు బుద్ధిపూర్వకంగా కోర్టువారు జారీచేసిన దావా నోటీసులు తీసుకోనందున, యి ప్రకటన ద్వారా మీకు తెలియచేయవలసినదిగా కోర్టువారు ఆర్డరు చేసి యున్నారు. పై నెంబరు దావా తే22-01-2024దీకి వాయిదా అయిఉన్నది. కావున వాయిదా తేదీ **ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలుగారు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు వ్రాతపూర్వకంగా కోర్టువారికి తెలియచేసుకొనవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానం చేయబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

//కోర్టువారి ఆర్డరు ప్రకారం//

నాగుమళ్ల జగదీశ్వరరావు
పిటిషనరు/వాది తరుపు న్యాయవాది,
బొబ్బిలి

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

OS 32/2023 IA 77/2023

BETWEEN:
గేదెల మురళీ ......పిటిషనరు/వాది
AND:
నడిపల్లి భాస్కరరావు ....రెస్పాండెంట్/ప్రతివాది
To,
నడిపల్లి భాస్కరరావు, S/o లేటు క్రిష్ణ, కిరణా వ్యాపారం, అగురువీధి, రామభద్రపురం గ్రామం & మండలం, విజయనగరం జిల్లా.

మీపై యిందలి వాది గారు దావా ప్రాంశరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం, పై నెంబరు దావా మరియు IA 77/2023 గా యిదిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ప్రథమ జప్తు కోరుతూ దాఖలు చేసియున్నారు. సదరు దావా మరియు IA 77/2023కి **తే 22-01-2024దీ**కి వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా తేదీ **ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలుగారు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు, మరియు సదరు దావా బాకీకి సరిపడు సెక్యూరిటీ సమర్పించుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

జిల్లా :- విజయనగరం, మండలం:- రామభద్రపురం, గ్రామం :- అగురువీధి, ఆస్తివివరం:- RCC స్లాబ్ ఇల్లు, అసేస్‌మెంటు నెం-1870.
హద్దులు :- **తూర్పు :-** నడిపల్లి చిన్నరాజు గారి తాలుకా స్లాబ్ఇల్లు, **దక్షిణం:-** సిసి రోడ్డు, **పడమర:-** రోంగలి జగ్గారావు గారి నివాసం, **ఉత్తరం:-** సిసి రోడ్డు
వాది విలువ :- రూ.3,00,000/-

నాగుమళ్ల జగదీశ్వరరావు
పిటిషనరు/వాది తరుపు న్యాయవాది,
బొబ్బిలి